# న్యాయమా! నీకేది న్యాయమా?

— తెనాలి సుశీలాదేవి

అదొక బస్‌స్టాండు. దాని వర్ణనంతా ఒక్క మాటలో చెప్పాలంటే బందుల దొడ్డి. అయితే కొంచెం బేదం. దీంట్లో అక్కడక్కడా మనుషులు, అక్కడొకటి, ఇక్కడొకటి బస్సులు ఉన్నాయి.

బందుల దొడ్డి అని ఎందుకనాల్సి వచ్చిందంటే మనుషుల కన్నా ఎక్కువగా కనిపిస్తున్న పశుసంపద— అంటే జంతు జాలం.

గుడ్డెద్దు చేలో పడ్డట్టు అనటం కన్నా గుడ్డి పశువు బస్టాండులో పడినట్లు అంటే బాగుంటుంది.

ఈ ఎద్దులు, ఆవులు ప్రాణం ఉన్న మనుషులకు కానీ, ప్రాణం లేని బస్సులకు కానీ వేటికీ భయపడవు. మనుషులే వీటిని చూసి పక్కకు తప్పుకోవాలి. ఆ తప్పుకోవడంలో కాస్త అటో ఇటో క్షణం ఆలస్యమైతే అవి వాళ్ళను దున్నుకుంటూ పోవడం ఖాయం.

ఇక వరాహమూర్తులు. ఇవంటే ఇంకా భయం. వాటి మూతికి, వంటికి పట్టించుకున్న పన్నీరు, గంధాలు అలవోకగా తమకూ కాస్త పులుము తాయేమో అని చురుగ్గా తప్పుకోవాలి.

ఇట్లా వీటన్నింటిలోంచి తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ!

ఇట్లాంటి ఒకానొక బందుల దొడ్డిలో—సారీ బస్‌స్టాండులో ఆ రోజు కాస్త ముసురుగా ఉంది. ఎండా రాదు. జల్లూ లేదు. అట్లాంటి ముసురులో సోడాకొట్టు ముందున్న బెంచీ మీద అప్పనంగా ( అంటే ఒక సోడాయినా, బీడీ నయినా కొన కుండా ) కూర్చోటానికి ధైర్యం చాలని ముత్తయ్య బంకు పక్కగా నిలువు కాళ్ళ మీద నిలబడి ఎంతకూ దర్శన మివ్వని తను ఎక్క వలసిన బస్సు కోసం పడిగాపులు కాస్తున్నాడు.

ఆకాశంలో లాగే వాడి మనసంతా ముసురు పట్టి ఉంది. కాకపోతే ఆకాశం మబ్బులా స్తబ్దుగా ఉంది. వాడి మనసులో మాత్రం ఉండుండి మెరుపులూ, పిడుగులూ.

టౌనులో బస్టాండులో నిలుచుని ఉన్నాడే కానీ— ముత్తయ్య మనసు మాత్రం ఏ టికెట్టు కొన కుండానే, ఏ వాహనమూ ఎక్కకుండానే వాడి పల్లె చేరుకుని అందులో పల్లె కొసగా నున్న తన పూరిల్లు చేరి అందులోకి దూరి ఉన్న ఒకే ఒక్క నులకమంచం లోనూ కళ్ళు తెరవక పడి ఉన్న పదేళ్ళ కొడుకు చుట్టూ పరిభ్రమిస్తూంది. కాళ్ళు చేతులు ఆడక ఆ మంచం కోడుమీదే తల వాల్చుకుని వేయి దేముళ్ళ మొక్కుకుంటున్న పెండ్లాం కనబడుతూంది వాడి కళ్ళ ముందు.

ఎట్టుందో పిలగాడికి?— మాటాటకటోసారి అనుకున్నాడు ముత్తయ్య.

"బిరీన పూరు చేరుకుని, ఎనకం బడితే బిడ్డను దీస్కొని, పెద డాక్టరు కాడికి ఎల్లబారాల." మననం చేసుకుంటున్నాడు పదేపదే.

"దుడ్లు సరిపోతయ్యో, లేదో." ఉసూరుమంది ముత్తయ్య ప్రాణం.

చొక్కా పైకి తీసుకుని లోపల బనీన కున్న జేబులోంచి నోట్ల మడత బయటికి తీశాడు. అసంకల్పితంగా వాటిని లెక్క బెట్టాడు. అప్పటి కెన్నిసార్లో లెక్కించాడు. అయినా మళ్ళీ. ఒకటికి పది సార్లు ఎంచితే మాత్రం అవేం పిల్లల్ని పెడ తాయా! వాడి తెలివి తక్కువకు వాడికే నవ్వొచ్చింది. వాడిమీద వాడికే జాలేసింది.

"ఇదేం దబ్బా!! ముండమోపి బస్సు ఏ ఎరవకూ రానంటుంది." తిట్టుకున్నాడు. నోట్లను భద్రంగా మడిచి బనీను జేబులోకి నెట్టి చొక్కా సరి చేసు కున్నాడు.

ఒగ బీడీముక్క కాల్చుకుంటే బాగుణ్ణు అనిపించింది ముత్తయ్యకు.

ముసురు, సన్నని ఈదర గాలి మనసు పుట్టిన కోరికను ఎగదోసింది.

చొక్కా జేబు తడిమాడు. అగ్గిపెట్టె ఉంది. బీడీలే లేవు.

బంకు ముందుకు పోయి ఒక్కటంటే ఒక్క బీడీ కొనుక్కున్నాడు. మళ్ళీ తనున్న చోటికి వచ్చాడు. బీడీ నోట్లో పెట్టుకుని అగ్గిపెట్టె తీశాడు.

"థూ. నీ యమ్మ." ఒక్క పుల్లయినా లేని ఖాళీ అగ్గిపెట్టెను విసిరి కొట్టాడు. బస్సు ఏ వేళకూ రాక తన ఖర్చును పెంచుతూందన్న విసుకు, విసురు వాడి ముఖంలో బాగా తెలుస్తూంది. వేళ్ళ మధ్య బీడీని నలుపుకుంటూ నుంచున్నాడు.

"అగ్గి కావా ల్నన్నా!"

తల పక్కకు తిప్పి చూశాడు ముత్తయ్య. ఎవడో తన అనుమంటోడే. పల్లెటూరోడు. కావాలన్నట్టు తల వూపాడు ముత్తయ్య ఎదుటోడు ఇచ్చిన అగ్గిపెట్టెతో బీడీ ముట్టించు కున్నాడు. ఒకటికి రెండు దమ్ములు లాగాకముత్తయ్య ముఖంలో విసుగు మాయమయింది. హుషారొచ్చింది కొద్దిగా.

"బస్సు కోసరమేనా?" సమయానికి నిప్పు ఇచ్చి నందుకు ఆదరంగా అడిగాడు ముత్తయ్య.

"అవు నన్నా! నీ దే వూరికి?"

చెప్పాడు ముత్తయ్య.

"నే నా బస్సుకే. మీ పల్లె దాటుకోని ఇంకా ఎగవకు బోవాలి."

"బస్సు ఈ ఎరవకు రావాల్సిందే కాదా?" ముత్తయ్య అడిగాడు. కాలక్షేపానికి మనిషి దొరికి నందుకు కొంచెం సంతోషంగా ఉంది.

"ఏ ఎరవకు వస్తాయో, ఏ ఎరవకు బోతాయో మనకూ తెల్దు. ఆ తోలేటోళ్లకూ తెల్దు. ఈడ చెప్పే నా కొడు కొక్కడూ లేడు. ఉన్నా నీ, నా అసుమంటి మొగాలకు పలకను గూడ పలకరు. అవి వచ్చినప్పుడు మన మెక్కి కూకోవాల. అవి బోయినప్పుడు మనం బోవాల—అంతే."

"ఔసను" అంటూ పరధ్యానంగా తల వూపాడు ముత్తయ్య. ఇంతసే పూ బిడి ఇచ్చిన సెగ, పొగ హుషారు తగ్గిపోయి వాడికిప్పుడు మళ్ళీ ఇల్లు పెండ్లాం, నులక మంచం, కొడుకూ మెదలసాగారు.

"సరేకానీ, అన్నా, నీ పేరేందో నాకు తెల్దు. నేను మాత్రం రాముల్ని. నీ వా బస్సుకు ఎక్కేది ఖాయమే కదా!"

"అది రావాల్నే కానీ, ఎప్పుడెప్పు డింటికి బోయ్ పడదామా అనుంది. ఎక్కేది ఖాయం కాక యాడ. అగసాట్లు బడే పనేముంది.."

"అయితే, అన్నా! ఒక సాయం జేయవా? కడుపులో, నొప్పిగా ఉంది. బయటికి పోయి రావల్ల. బస్సొస్తే నువ్వెక్కి నీ పక్కన్నే నాకు సోటు బెట్టేడు. జనం నిండక పోతారు బస్సు రాంగానే. శానాసేపు నిలబడలేను. బిరీన బోయస్తా."

"అంతేకదా, అట్నే బెడతాలే. అవులే నువ్వు బిర్నరా. బస్సు యింగొస్తుందా, ఏమో."సందేహంగా అటూ ఇటూ చూశాడు ముత్తయ్య.




"రాన్లే. వస్తానే పోతుందా, పాడా. ఆ బస్సొల్లు కాఫీ, టిఫినూ తిని రావద్దా. నువ్వెక్కి కూసోనుండు. నేనీడున్నట్టు రానూ. అదిదో ఈమూటట్లా పట్టుకో నుండన్నా. నువ్వెక్కతానే నీ పక్కన్నే నాక సోటు నూసి ఆ సీట్లో ఈ మూట బెట్టేయి. ఎవ్వరూ కూకోరు. మరి నే బొయ్యొస్తా. ఇదా— అంతవరకు ఈ బీడి కాల్చుకుంటా ఉండు."

అయాచితంగా లభించిన బీడితో ముత్తయ్య ముఖం విప్పారింది. బస్సొచ్చే లోపల మళ్ళా బీడి కొనుక్కోవలసిన పని లేకుండా మిగిలిన కాడికి మిగిలె అని సంతోషించాడు. తన చేతిలో బెట్టిన చిన్న మూటను గట్టిగా పట్టుకుని, అంటించి ఇచ్చిన బీడిని నోట్లో పెట్టుకుని, చూస్తూ ఉండి పోయాడు ముత్తయ్య—బిరబిర పోతున్న రాముల వైపు—బస్సొచ్చే యాలకు ఒస్తాడో, రాడో. పాపం కడుపులో నొప్పంట. బస్సొస్తాదంటే మాత్రం బయట కెల్లాల్సొస్తే పోక నస్తాదా ఎవుడయినా అనుకుంటూ.

ముత్తయ్య మళ్ళీ ఒకసారి ఏ దిక్కునుంచయినా బస్సు వస్తా ఉందేమోనని తేరి పార చూశాడు.

రంగు వెలిసి పోయిన పాత బస్సు వాని కండ్ల కెక్కడా కనబడలేదు. చివరి కంటా కాలుకుంటూ వస్తూన్న బీడీని చూస్తూ, ఉస్సురని నిట్టూరుస్తూ నొప్పి పుట్టిన కాలును మార్చుకుంటూ నిలబడ్డాడు.

బొంయ్. బొంయ్. మన్న శబ్దంతో పరధ్యానంగా ఉన్న ముత్తయ్య ఉలిక్కి పడ్డాడు.

"అమ్మ దేవుడా! బతికించి నావు, నాయనా!" అనుకుంటూ ఒక్క ఉరుకున బస్సు దగ్గరకు పరు గెత్తాడు ముత్తయ్య.

దిగే వాళ్ళను దిగనీయకుండా ఎక్కేవాళ్ళు, తాను దిగందే ఎట్లా ఎక్కుతారని దిగేవాళ్ళు ఒకటే గోల. త్రోపుడు. తొక్కిసలాట.

వూడిపోయిన పంచ గోచిని ఒక చేత్తో ఎగ జెక్కుకుంటూ, మరో చేత్తో ఆ చిన్న మూట పట్టుకుని పద్మవ్యూహంలోకి జొరబడినట్టు దూరి బస్సులో ఎక్కేశాడు ముత్తయ్య. తొందరగా పోయి కిటికీ దగ్గరగా కూచుని మూటను పక్కనే పెట్టు కున్నాడు రాములు సీటు కోసం.

"అమ్మయ్య."

ఒక్కసారి గుండెల నిండా గాలి పీల్చి సంతోషంగా నిట్టూర్చాడు బస్సు వచ్చినందుకు, తా నెక్క కలిగి నందుకు, కూర్చోటానికి సీటు దొరికినందుకు.

"మూట దీవయ్యా, కూసోవాల" అని ఉరిమి చూసి అడిగే వాళ్ళందరికీ—

"మా మనిసొస్తాడు" అని చెప్పలేక విసు గొచ్చేసింది ముత్తయ్యకు.

బస్సు కిటికీలోంచి బస్టాండంతా కలియ వెతుకు తున్నాయి వాడి కళ్ళు రాముల కోసం. "అయిపు లేదు" గొణుక్కున్నాడు.

ఇటూ అటూ అసహనంగా పరికించాడు కాసేపు.

"బస్సు కదల్తాదో ఏమో? ఇంగా రాలే." అను కున్నాడు.

పది పదిహేను నిమిషాలు గడిచాయి. డ్రయివరు, కండక్టరు సుష్టుగా తిని, కాఫీలు తాగి బీడీలు కాల్చు కుంటూ బస్సు నెక్కేసినారు.

"పోనిస్తాడో ఏం పాడో!" గాభరాగా చుట్టూ చూస్తున్నాడు ముత్తయ్య.

డ్రయివరు సీటులో కూర్చునే ఇవతలికి తొంగి చూస్తూ దిగువ నున్న ఎవరితోనో మాట్లాడు తున్నాడు.

"పోనీవయ్యా, డ్రైవరూ! రావడమే లేటు. ఇంకా ఎంతసేపు నిలేస్తావు ఇక్కడ?" విసుగ్గా అరిచాడు వెనక సీటు లోంచి ఒక నవనాగరికుడు.

"అయ్యో! ఈ డేం మనిసి? ఈని దొడ్డి దొంగ ల్దోలా." అనుకుంటూ చుట్టూ చూస్తూనే ఉన్నాడు ముత్తయ్య.

ప్రయాణికుల తొందర చూస్తుంటే కూసింత ఆపు అనే ధైర్యం కలగడం లేదు వానికి.

"పోనీయి నాయనా? ఇంటికాడ పనున్నాయి." ఎవరో ఆడోళ్ళు అంటున్నరు. డ్రయివరు బొంయ్ బొంయ్యన హారన్ కొట్టి, కండక్టర్ 'రైట్' చెప్పి.

"అయ్యో రామా. ఈడు రానేలేడే." ముత్తయ్య గుండెలో అలజడి, కళ్ళలో ఆత్రుత.

"అమ్మయ్య. బస్సు కదులుతూంది." ప్రయా ణికుల్లో రిలీఫ్.

అయితే ఆ రిలీఫ్ కలిగినంతసేపు పట్టలేదు వాళ్ళ గుండెలో రాయి పడటానికి.

"అవు బస్సు."

గట్టిగా అరుస్తూ కదలుతున్న బస్సును ఎక్కాడు ఒక కానిస్టేబిలు.

మళ్ళీ బర్ మనిపించాడు డ్రయివరు బస్సుని.

"హోల్డాన్. ఏయ్ చెబుతూంటే నీ క్కాదూ బస్సాపమని." ఉరిమి చూస్తూ అన్నాడు.

ఆ ఉరుముతో సరిగ్గా చూశాడు డ్రయివరు అతడివి. మామూలు కానిస్టేబుల్ కాదు. హెడ్‌కానిస్టేబులు.

"ఎక్కారు గదండీ." నసుగు తున్నట్టున్నా, కొంచెం విసురుగానే అన్నాడు డ్రయివరు.

"శివునికి గంగ నెత్తి మీద పెండ్లాం అయినట్టు వీళ్ళంతా మా నెత్తి మీద మొగుళ్ళు." లోలోపలే తిట్టుకున్నాడు డ్రయివరు.

"నీ బస్సులో ఎక్కి సర్దాగా ప్రయాణంచేయ డానికి రాలేదు కానీ, నిలిపెయ్ రవంత సేపు. పాసింజర్లందరినీ చెక్ చెయ్యాల."

ఠీవిగా లాఠీ తిప్పుతూ సూటిగా, వాడిగా బస్సంతా కలియ జూశాడు హెడ్డు.

ఏదో ఉద్దర కదా. ఎక్కుంటాడు. యాణ్ణో దిగేస్తాడు. అనుకున్న పల్లె జనానికి ఈ సారి ఆ ఎర్ర టోపీ, చేతిలో కర్ర, కాకీ గుడ్డలు చూడ గానే గుండెలో గుబులు పుట్టింది.

"పిల్లోళ్ళకరు మధ్య మధ్య తనిఖీలు. వెళ్ళేవాటిని వెళ్ళనియకుండా అకస్మాత్ క్షణంలో రావడం, మా ఎస్. ఐ. వస్తున్నాడనో, వాళ్ళ ఫామిలీ వస్తూందనో బస్సు నలా నిలిపేయటం. వాళ్ళ తాత సొమ్ము ఈ బస్సు అన్నట్టు టికెట్‌కొని కూచున్న వాళ్ళను లేసేసి దర్జాగా సైసా పెట్ట కుండా బస్సుల్లో పూరేగటం. లేదంటే ఏదో చెకింగ్‌నీ అదనీ, ఇదనీ..." నెమ్మదిగా గొణుక్కో సాగారు వెనక సీట్లోని ఇద్దరు నూట్‌వాలాలు.

అయితే ఇంతమందిలోనూ బస్సు ఇంకొంసేపు నిలుస్తుంది పోలీసోవి ధర్మమాని అనుకుంటూ సంతోషించింది ముత్తయ్య ఒక్కడే.

ఆత్రుతగా రాములు కోసం మళ్ళీ మళ్ళీ దిక్కులు చూడసాగాడు. వాడి మనసులో మరో సందేహం కూడా తొలుస్తూంది.

ఒకేల బస్సు బొయ్యే లోపల ఈడు రాకుంటే ఈ మూట ఎట్టాట్ట అడికి చేర్చేది? ఒకటే ఆరాటపడసాగాడు.

కిటికీలోంచి అలా బయటికి చూస్తూండి పోయిన ముత్తయ్య 'ఏయ్' అన్న గర్జనతో పాటు, తన డొక్కలో ఏదో పొడుచుకున్నట్టయి ఉలిక్కి పడి తిరిగి చూశాడు. బిత్తరపోయాడు. ఒక్క క్షణం భయంతో రెపరెపలాడాయి వాడి కళ్ళు—తనను గుడ్లురిమి చూస్తున్న ఎర్రటోపీని చూసి.

"ఈ మూటెవరిది?" కంఠం కూడా ఉరిమినట్టే అనిపించి తత్తరపడ్డాడు ముత్తయ్య.

"నా . . నా . . నాద . ."

"ఏ ముందందులో?"

"తె. . .తె. . . తెలవదయ్యా!"

చుట్టూ కొందరు నవ్వినట్లు అనిపించడంతో తనేం తప్పు మాట్లాడేడో తెలీలేదు ముత్తయ్యకు

"రేయ్ మురికి నాయాలా! నీ మూటలో ఏముందో నీకు తెలవదురా?" పండ్లు బిగబట్టి సాగదీస్తూ అడిగాడు హెడ్డు, మూటను లాటీతో గుచ్చి చూస్తూ. అప్పుడు తెలిసింది ముత్తయ్యకు తన పొరపాటు. నాలిక్కొరుక్కున్నాడు.

కంపరం అణచుకుంటూ ... చేతులు నలుపు కుంటూ.

"మూట నాది కాదయ్యా... ఇంగో మడిసి... నాకిచ్చి... పట్టుకోనుండమవి... బస్సొస్తే సీటు బెట్టేడమని"

"ఒరేయ్ తప్పుడు కొడకా! ఇంతసేపు మూట నీదేనని... ఇప్పుడు దొరికిపొయ్యేతలికి కథలల్లుతావురా... కథలు... ఆ ఇంగో మనిసేడిరా? బస్సు బోతా ఉంటే కూడా రాడ్రా దీంట్లో బోవాలనుకున్నాడు.. ప్చ్..." హుంకారం చేశాడు హెడ్డు.

భయంతో గుక్కిళ్ళు మింగాడు ముత్తయ్య. యమధర్మరాజులా కనిపిస్తున్న హెడ్డు ముందు మాట పెగలటం లేదు. గొంతు తడారిపోతూంది ముత్తయ్యకు.




వెన్నెల్లో ఆడపిల్ల
సంచలనం

- విడుదలైన రోజునే మొదటి ముద్రణ కాపీలు అమ్ముడైన ఏకైక నవల.
- క్షణక్షణం మిమ్మల్ని సస్పెన్స్‌లో పెట్టి పూర్తయ్యాక ఒక మధుర భావాన్ని మీ మనస్సులో కలకాలం నిలబెట్టే నవల.

యండమూరి వీరేంద్రనాథ్
..... వెన్నెల్లో ఆడపిల్ల ...

12 రకాల చేతి వ్రాతలను విశ్లేషిస్తూ, మొట్ట మొదటిసారిగా తెలుగులో వెలువడిన 'గ్రాఫాలజీ' పుస్తకాన్ని యీ నవలతోపాటు ఉచితంగా పొందండి ! పాఠకుల ప్రత్యేక కోరికపై ఈ రెండవ ముద్రణ వరకే పరిమితం ! త్వరపడండి !

వెల : 15/—రూ॥ (లకే రెండు పుస్తకాలు)

పుస్తకం ధరలో 10/- రూపాయలు M. O. చేయండి మిగిలిన 5/- రూలకు V. P. లో పంపగలము.

నవసాహితి బుక్ హౌస్, విజయవాడ-520002

ప్రకటన

సౌదీ అరేబియాలో 1-10-82 నుండి దినమణి; దినమణి కదిర్; ఆంధ్రప్రభ వారపత్రిక; సినిమా ఎక్స్‌ప్రెస్ మరియు కత్తై కదిర్‌లను వారి స్వంత బాధ్యతపై విక్రయించడానికి మెస్సర్స్ నాజ్ బుక్ డిపో, బుక్ పబ్లిషర్స్ అండ్ బుక్ సెల్లర్స్, షాప్ నం. 1, మహమ్మదాలి బిల్డింగ్, మహమ్మదాలి రోడ్, బొంబాయి (400 003) ద్వారా మెస్సర్స్ అల్ అదాబియా పబ్లిషర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్, పి బి నం. 158, అల్ ఖోబర్, ధాహ్రాన్ ఎయిర్ పోర్ట్, సౌదీ అరేబియా కింగ్డమ్‌కు ప్రత్యేకంగా అధికారం ఇవ్వబడినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

మార్కెటింగ్ మానేజర్

మద్రాసు
8-11-82

"ఏరా . . . మూగెద్దులా కూసున్నావు... అడిగించి ఇనవళ్ళా... ఏ డా మడిసి... ఎవు డాడు?"

"నాకూ తెల్దయ్యా కడుపులో నొప్పిగా ఉందని బయలెల్లొస్తానని... బిరీన వస్తానని జెప్పి... కానా సేవఖు..."

"ముయ్‌వాయ్ నోరు—నీ కాకమ్మ కథలు ఇండానికి నేను వాజమ్మను గాసురోయ్. వూ . . . తియ్ మూట... ఇప్పు..." ఆజ్ఞ జారీ చేశాడు హెడ్డు.

పాసింజర్లందరూ కుతూహలంగా చూస్తున్నారు వీళ్ళిద్దరి వైపు.

"ఈ మూట . . వాది . . . నాది కాదయ్యా!" గొంతులో ఎక్కడో, ఏదో పట్టుకున్నట్టు అవుతూంది ముత్తయ్యకు.

"చల్... మళ్ళీ అదే కూస్తావ్. ముం దామూట ఇప్పు."

అధికారయుక్తంగా వెలువడిన ఆజ్ఞకు ఇక మారుమాట అనే ధైర్యంలేదు ముత్తయ్యకు.

పాసింజర్లలో కుతూహలం...పోలీసోడి గొంతులో కరుకుదనం ...

ముత్తయ్య గుండెలో రైళ్ళు పరుగెత్తించాయి.

వణుకుతున్న వేళ్ళతో మూట ముడి విప్పాడు. దాంట్లో మరో చిన్న మూట. పాసింజర్లు సీట్లలోంచి ముందుకు వచ్చారు దగ్గరగా.

చిన్న మూట కూడా విప్పబడింది.

అందరి కళ్ళూ ప్రశ్నార్థకంగా ఒకరికేసి ఒకరివి తిరిగి, అందరివీ కలిసి ఎర్రటోపీ వైపు తిరిగాయి.

బట్టల కొట్టులో ఇచ్చే బ్రవున్ కవరు తాలూకు ఆడబొమ్మ కవరును పాకెట్టుగా మడిచి కట్టడంతో నడుం దగ్గర విరిగినట్టు వెనక్కి వాలిపోయి...

"వూ... ఆ పాకెట్టు విప్పు." ఉరిమాడు హెడ్డు.

న్యూస్ పేపరులో దారంతో బిగించి కట్టబడిన సరుకుల పొట్లం లాంటిది తొంగి చూసింది.

"ఒహ్... కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉంది." కిసుక్కున నవ్వారు ఎవరో మెల్లగా గొణుగుతూ.

"పాపం ఇంటికి కావలసిన సరుకేదో కొనుక్కుపోతున్నట్టు ఉంది. వూరికినే కంగారు పెట్టేశారు" ఇంకెవరో తోటి ప్రయాణీకుని సానుభూతి.

అరికాలు మంట నెత్తికెక్కినట్టయింది హెడ్డుకు.

"పొట్లం వూడదీకు వాయ్!" కసిరాడు.

"వాది గాదయ్యా! ఆ మనిషేమన్నా అనుకోడా?" ఇబ్బందిగా అన్నాడు ముత్తయ్య

"మనిసీ లేడు. గాడిద గుడ్డూ లేదు. నీ దొంగ యవ్వారాలు నాకాడ గాదొరే.వూడదీ ముందు!!

దారం విప్పాడు... పొట్లం వూడదీశాడు ముత్తయ్య.

"హా.. " అన్నారు ఒక్కసారిగా అందరూ ఆశ్చర్యంతో.

ఆ ఒక్కక్షరం కూడా పలకలేని భీతావహ స్థితిలో ముత్తయ్యకు ముచ్చెమటలు పోశాయి. వాడి పై ప్రాణాలు పైనే పోయినట్టయింది.

ఆ పొట్లం నిండా వాచీలు, రిస్ట్‌వాచీలు...పదో ఇరవయ్యో... కొత్తవి... తళతళా మెరిసిపోతున్నవి.

ఆ తళతళలు ముత్తయ్య కళ్ళలో చీకట్లు కమ్మించాయి. పోలీసోడి కళ్ళలో మెరుపుల్ని మెరిపించాయి.

"దొంగనాబట్టా! ఇప్పుడు జెప్పరా నీ కథలు పోలీస్టేషన్ కొచ్చి. లెగవాయ్. దిగి రా ముందు... మూట దీసుకో." లాఠీతో బలంగ ముత్తయ్య డొక్కలో పొడిచాడు.

"నోర్నాయనో నాకేం తెలవదు సామీ... నా బిడ్డ సాచ్చి." అప్పుడే తెలివొచ్చినట్లు బెంబేలెత్తిపోయిన ముత్తయ్య వంగి పోలీసు కాళ్ళు బట్టుకున్నాడు గట్టిగా.

రెక్క బట్టుకుని ఒక్క వూవున పైకిగుంజాడు ముత్తయ్యను హెడ్డు.

పెనుగాలికి చిగురుటాకులా కంపించి పోతున్నాడు ముత్తయ్య.

ప్రేక్షకులుగా మారిపోయిన ప్రయాణీకులందరూ సినిమా చూస్తున్నట్టు చూస్తున్నారు.

"ఎంత మోసం..." ఆశ్చర్యంగా.

"ఎర్రాడి నాగున్నాడు. ఏమేం యాపారాలు సేస్తాం సూడు" భయంగా...అసహ్యంగా...


"పాపం! వాడు చెబుతున్నది నిజమేనేమో!" సానుభూతిగా.

"ఓసనో శెప్పుకోవాల్సిందే గానీ యీళ్ళేవరు." ఎవరో అనుభవజ్ఞుడి ఉవాచ.

ఇలా ప్రకటిస్తున్న ఎవరి హావభావాలతోనూ సంబంధం లేనట్టు సీరియస్ అయిపోయాడు హెడ్.

"దిగరా దొంగనా బట్టా! ఇంగా మిడి గుడ్లేసుకొని సూస్తున్నవ్. ఆ మూట దీసుకో."

కంపిస్తున్న చేతులతో మూటను అప్రయత్నంగా పట్టాడు ముత్తయ్య. పాదాల్లో శక్తి లేనట్టు




మూలబడి పోయేలా ఉన్నాడు.

మెడమీద చెయ్యేసి గెంటుకొచ్చినట్టు బస్సు దించి దించాడు ముత్తయ్యను. కిటికీలోంచి గుంపుగా ఒకరిమీద ఒకరు పడి తొంగిచూస్తున్న ప్రేక్షకులు డ్రయివరు బస్సు స్టార్టు చేయటంతో ఒక్కసారిగా పాసింజర్లుగా మారిపోయారు.

ఇక బస్టాండులోని జనానికి ఎర్రటోపీ చేతిలో చిక్కుకున్న మనిషిని చూస్తే ఏమిటో విషయం అడగాలనిపించినా— మన కెందుకులే దేవుడా...నేలతో పోయేది నెత్తికి రాసుకున్నట్టు ఈ పోలీసోళ్ళతో అనుకుని చూసీ చూడనట్టు ఉండిపోయారు.

• • • •

బస్టాండుకు దగ్గరగా నున్న చిన్న గవర్నమెంటు ఆస్పత్రి ఆవరణ అది. చుట్టూ పెద్ద ఆవరణ, పెద్ద పెద్ద వేపచెట్లు, మధ్యలో ఒకటి రెండు చిన్న రూములు, చుట్టూ వరండా. ఇది ఆ ఆస్పత్రి.

చెట్ల కిందున్న చిన్న రాతి అరుగుమీద కూర్చుని ఉన్నాడు హెడ్డు. అతని కాళ్ళ ముందరగా, నేలమీద జీవచ్ఛవంలా మోకాళ్ళమీద తల వాల్చుకుని కూలబడి ఉన్నాడు ముత్తయ్య.

ముత్తయ్య గుండెల్లో సముద్రపు ఘోష. 'ఈ గండం గడిచే దెట్టాగో...భగవంతుడా' అని కనిపించని వెయ్యి దేముళ్ళకి మనసులోనూ, ఎదురుగా కనిపిస్తున్న హెడ్డుకి చేతులెత్తుతూనూ మొక్కుతున్నాడు.

"చూడు ముత్తయ్యా! నువు చెప్పిందంతా ఇన్నాను. నువు దొంగవో కాదో నేను చెప్పలేను కాని ఇపుడు ఎవురు జూస్నీ—నిన్ను దొంగే అంటారు. అంటారా అనరా నువు జెప్పు. నీ సేతుల్లో దొంగ సరుకుంది. నీది కాదూ అని రుజూ చేసుకోడానికి నీకు సాక్ష్యం ఎవురూ లేరు. స్టేషన్‌కు దీసుకు పోకనూ తప్పదు. నీకు కొన్నాళ్ళు మా మర్యాదలూ తప్పవు. నాతో వచ్చిన కానిస్టేబిలు పని మీద ఆ పక్క కెళ్ళాడు. రాగానే స్టేషనుకు పోదాం నాయనా!" తాపీగానూ, వ్యంగ్యం రంగరిస్తూనూ అన్నాడు

హెడ్డు.

రాయి ఎంత చిన్నదయినా నీళ్ళలో పడితే కలవెళ పడక మానవవి. ఎంత తాపీగా వినిపించినా ఆ మాటలు ముత్తయ్య గుండెల్లో పెద్ద బండను వడేశాయి.

"నోర్నాయునో...ఇదేం శవిరా ఎంకటరమనసామీ? నేనేం అపరాదం జేసినో దేవుడో... నీకు పెయ్యేత్తి మొక్కోనే ఎల్లబారితినే ఇంటికాడ. నే నీడ సిక్కడి బోతే నా పిల్లోడు...గుర గుర మంటుండే ఆడి పేనం?"

కడుపులో గుబులు ఆవేదనగా మారి, అది దు:ఖంగా రూపుదాల్చి...కంఠంలో సుళ్ళు తిరిగి... కళ్ళల్లోకి వచ్చేసి...బయటికి ఏడ్చేశాడు ముత్తయ్య.

"చూడ్నాయునా! నెమలి కంటినీళ్ళు వేటగానికి ముద్దా. నువెంత ఏడ్చి మొత్తుకున్నా ఈ సొత్తు నీ దగ్గరున్నందుకు నిన్ను దీసకపోక తప్పదు. నువు జెప్పేది నిజమయినా, కతయినా ఆడ జెప్పుకోవాల్సిందే. నిన్ను చూస్తే నాకూ బాదగనే ఉందనుకో. అయితే మాత్రం నేనేం జేతు. దొరికిన కేసుని ఎట్ల ఇడిసమంటావు. నాకు మాటొస్తుంది. పైగా ఈ సొత్తు..."

హెడ్డు మనసు కొంచెం మెత్త బడినట్టు అర్థమయిపోయింది ముత్తయ్యకు.

"అన్నా! నీ కాళ్ళకు మొక్కుతా. ఇంటికాడ నా బిడ్డకు బాగనేను—చచ్చేపానం, పోయే పానంగా ఉంది. నే బోకుంటే వాడు చస్తాడు. డాకటరు కాడికి దీసకపోవాల. నీ పున్నె ముంటుంది నన్నిడువా?" జాలిగా అడిగాడు ముత్తయ్య.

"ఇది బాగుందొరే—నేనేం జేస్తను? పది మందిలో పట్టుబడితివి. నిన్నిడిసిపెట్టి ఈ దొంగ సరుకు నా మెడకు జుట్టుకోమంటావా... నే నీ కేసు పట్టుకున్నపుడు నా తోటి పోలీసుసోడు కూడా జూసెనే. నా దూరుకుంటాడా?"

ముత్తయ్య ఇంక ఆలోచించలేదు. చప్పున ముందుకు వంగి హెడ్డుగారి కాళ్ళు రెండూ గట్టిగా వాటేసుకున్నాడు.

"సచ్చి నీ కడుపున బుడతా నన్నా. ఎట్లయినా దయ సూపించు. నిజంగా ఈ మూట నాది కాదు. నా కరమ అంతే. నువు తల్సుకుంటే నన్నిడిసేయలేవో." ప్రాదేయ పడుతున్నాడు ముత్తయ్య. విలపిస్తున్నాడు ముత్తయ్య.

బాగా నయంగా దగ్గరికి రానిచ్చి అమాంతం ఎగిరి ఒడిసి పట్టుకున్నట్టు ఒక్క మాటన్నాడు హెడ్డు.

"లెక్కుందా జేబిల."

ముత్తయ్య చేతులు చప్పున తన జేబును అదిమి పట్టుకున్నాయి. కళ్ళు విప్పార్చి చూశాడు.

"ఏం దట్లా జూస్తావు ఎర్రో నాకట్టు. జేబిలో దుడ్లుంటే తియ్య. నా తంటాలు నేను బడి వాటితో ఎట్లనో నే సరిసేస్తా. నిన్ను చూస్తే జాలి పుడతా ఉంది." దయగా అన్నాడు హెడ్డు.

"ఎంత?" హీన స్వరంతో అడిగాడు ముత్తయ్య.

"మాట యేభయ్యన్నా..."

"అమ్మ దేవుడో" ఒక్కరువు అరిచాడు ముత్తయ్య.

తీవ్రంగా చూశాడు హెడ్డు.

"ఎందుకట్ల అరుస్తావు. జైలుకు బోయినావంటే సంవత్సరం కూసుంటావు. లేదా జరిమానా రెండు వేలు, మూడు వేలు."

"ఎలా..." నిర్ఘాంత పోయాడు ముత్తయ్య.

"ఏలు కాదొరే. నీ చేతి వేళ్ళు, కాలి వేళ్ళు అనుకుంటున్నావా...వేలు...వేలు...దుడ్లు..."

కళ్ళు గిర్రున తిరిగాయి ముత్తయ్యకి.

హెడ్డు చెబుతున్న ఆ 'ఏల'కి ఎన్ని పది రూపాయల నోట్లు యెయ్యాల్నో తెలీదు గానీ ముత్తయ్యకి—అవెన్నో శానానే ఉంటాయి. తనకు తెలియనంత అనుకున్నాడు. ముత్తయ్య పుట్టి బుద్దెరిగి అంత లెక్క కండ్ల జూసిండాయీకాడికి.

ఉస్సురుమంది ముత్తయ్య ప్రాణం.

"అన్నా! చెపితినిగదా నా సంగతంతా. బిడ్డకు బాగలేదు. పెద డాకటరు కాడికి తోలకబోవాలి. లెక్క గావాల...అందుకోసరంగానే..."

ముత్తయ్య తన మాటలు పూర్తి చెయ్యనే లేదు. హెడ్డు తగులుకున్నాడు.

"సూడ్నాయునా! పాడిందే పాడరా పాసి పండ్ల దాసరీ అని నువు చెప్పిందే చెబుతున్నావు. నేనూ చెప్పిందే రిపీటు సేస్తున్నాను. నీ ఇబ్బందులు నీవి. నేనేం జేయులేను. నువు ఇంగ కాళ్ళా వేళ్ళా బడతా ఉంటే చూశ్కె కవిన్నిక్కడ బొక్కలోకి తొయ్యకుండా ఏదో సేస్తామనుకున్నా. బొక్కలోకే బోతావో, బొమ్మాయపాలెంకే జేరుకుంటావో నీ ఇష్టం. నేను సాయం చేయుగల ఒకే ఒక దోవ సూపించినా!" అనేసి ఇక తనకేం సంబంధం లేనట్టు బీడి ఒకటి దీసి వెలిగించుకున్నాడు.

కండ్లముందు బొమ్మలు తిరిగినట్టయింది ముత్తయ్యకు.

ఈడ జేల్లో పెడితే ఇంగ పెండ్లాం, పిల్లోని ముగాలు ఎపుడు జూస్తనో...అసలు పిల్లోడు అంతదనక పానాల్తో ఉంటేగదా...ఇపుడే ఎలిపోతే ఏదో ఒక దోవ ఎతుక్కోవచ్చు.

ముత్తయ్య మనసు గట్టి చేసుకున్నాడు.


వాని కండ్లలో నీళ్ళూరుతున్నాయి. చేతులు తడబడుతున్నాయి. చొక్కా పైకెత్తి కండ్లు తుడుచుకుని...చేతితో తడిమి తడిమి...బనీను జేబులోంచి తీసి...చూసి...చూసి...ఎంచి...ఎంచి...

"డూద్!" కనుబొమలు ముడేశాడు హెడ్డు.

"ఏందిది..." అన్నాడు చేతిలో నోట్లు జూచుకుంటూ.

"లెక్క...యాబయి రూపాయిలు." బరువుగా అన్నాడు ముత్తయ్య.

"లెక్క అనే సంగతి దెలుసు లేవాయ్— ఈ యాభైతో జారిపోదా మనుకుంటున్నవా. ఎవరి చేతులు తడపమంటావ్ దీంతో. 'యా...బయి' అంటున్నావు. నీ కిదొ పెద్ద లెక్క కాని, ఎడమ చేత్తో కూడా తాకరొరే ఈమాత్రాన్ని." నిర్లక్ష్యంగా తలెగరేసి నోట్లు విసిరాడు ముత్తయ్య వైపు.




కాళ్ళమీది కొచ్చి పడిన నోట్లను అబగా చేతికి తీసుకుని అపరాధం అన్నట్టుగా — దుడ్డు మాలచ్మిని కండ్ల కద్దుకుని చెంపలు వాయించుకున్నాడు ముత్తయ్య. జాలిగా... బేలగా...మళ్ళీ బనీను జేబులోకి చెయిపెట్టాడు ముత్తయ్య. చూసీ చూడనట్టు వోర చూపులు చూస్తున్నారు హెడ్డు—గుప్పు గప్పున పొగ వదులుతూ కాలిమీద కాలేసుకు కూర్చుని.

"ఇంద." అన్నాడు బెరుకుగా.

ఎంచెంచి పది పది రూపాయల నోట్లను చేతులారా అందిస్తుంటే వాడి ప్రాణమంతా దోసిలిలో పెట్టి ఇచ్చేస్తున్నట్టు ఉంది ముత్తయ్యకు.

అందుకోలేదు హెడ్డు. చట్మన లేచి నిలబడి డ్రస్సు దులుపుకున్నాడు. ముత్తయ్య గుండె జారిపోయింది.

"అన్నా...అన్నా...ఇగో సూడు" అంటూ ఎడమ చేత్తో బనీను జేబులోంచి మిగిలిన ఐదు పది రూపాయల నోట్లను తీసి, జేబును వెల్లకిలా

తిప్పి చూపించాడు.

ఆ అయిదు నోట్లని పిడికిలిలో గట్టిగా బిగించి పట్టుకున్నాడు.

"అన్నా...ఇంగింతే ఉంది...పిల్లోన్ని డాకటరుకు సూపించాల...మందులు గొనాల...ఇదయినా ఎట్ల దెస్తినో నీకు చెప్పినాను గదా!" మెడమీదికి కత్తి విసరబోతున్న కసాయి వాడికేసి మేక చూసినట్లు ఉంది ముత్తయ్య చూపు.

"నాయనా...నీ మూర్రాపాయలు నువేదీసుకో. నీ కతా నాకింక చెప్పొద్దు. ఈ కాయగూరల బేరల నాకొద్దు. ముక్కూ మొగమూ దెలిని నీ కోసరం వాళ్ళ కాళ్ళూ...వీళ్ళ కాళ్ళూ పట్టుకుని ఇబ్బందిలో పడే ఖర్మ నాకెందుకు? లెయ్...సద...పోదాం."

బీడి ముక్క పారేసి, ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని ఖాండ్రించి ఉమ్మి, బండమీద పెట్టిన లాటీని చేతిలోకి దీసుకుని, అంత వరకూ పక్కనే విశ్రాంతి తీసుకుంటున్న ఎర్ర టోపీని శిరస్సు కలంకరించుకుని...

"ఒన్నోవ్...కూసో...కూసో...నా మాటిను. నన్ను నట్టేటో ముంచాకు. నామీద కనికరం బెట్టు. ఎట్లోనకట్ల జేసి నన్ను ఇంటికంపించు. నా అగసాట్లేవో అన్నే బోయి పడుకుంటా..." చేతులు పట్టుకున్నాడు ముత్తయ్య.

ముత్తయ్య రెండు చేతుల్లోని నోట్లు హెడ్డు రెండు అరచేతుల్లోకి పోయి గుప్పిళ్ళు మూతపడ్డాయి.

"ఇప్పటికి తెంచినావురా, నాయనా! నాకు కనికరం లేక గాదురా, నాయాలా. ఆడ పెద్దోల్లకు ఉండదు మరి. నేనేం జేస్తు? దీంతోనయినా ఎట్ల మాఫీ జెయ్యాల్నో ఏమో.. కేసే దీసక పోయుంటే నా కీ బాదేలేదు. ఏమంటే నీ ఏడుపు మొగం జూసి, నీగోడు ఇనలేక...పరెలె... ఇంగబో.. నా తంటాలు నే బడతా. ఆ పొట్లం మూట సరిగ్గా కట్టిపెట్టు" అన్నాడు హెడ్డు.

చెమటకంపు బనీను జేబులోండి వచ్చిన నోట్లు ఫెళఫెళ లాడుతున్న లేబులోకి దూరాయి. హెడ్డు కలకల లాడిపోతున్నాడు. అతని ముఖంలో మెరుపులు.

ముత్తయ్య వెలవెల బోతున్నాడు. వాని మొగంలో చీకట్లు.

ఒకరి కంట్లో కళలు. మంరొకరి కంట్లో కన్నీళ్ళు.

మూట బిగించి...కట్టిపెట్టి ...చేతులు రెండూ జోడించి...

"అన్నా..." ఏడుపుతో పూడుకుపోతున్న గొంతుతో.

"ఇంగా ఏందిరా నీ నస."

"బస్సెల్లి పోయి ఉంటది. నాకాడ సార్జీకి కూడా దుడ్డులేదు. ఏ లారీల నయినా బోయి, కొంత దయ జూపిచ్చవా."

హెడ్డు ముత్తయ్య వంక సాలోచనగా చూశాడు. అప్పుడే ఆత్మీయుల శవం తగలబెట్ట వచ్చిన వాడులా కనబడ్డాడు ముత్తయ్య.

"ఇంద ఈ అయిదు దీసికొనిపో. ఇందింక నా చేతినుంచి ఏసుకోవాల."

గొణుగుతూ తన జేబులోంచి అయిదు నోటు తీసిచ్చాడు హెడ్డు.

ముత్తయ్య అదే ప్రసాద మన్నట్లుగా దోసిలి పట్టి అందుకున్నాడు. నోటును కళ్ళకు అద్దుకున్నాడు. హెడ్డు పాదాలను అరచేతు లాన్చి కళ్ళ కద్దుకున్నాడు.

● ● ● ●

ముత్తయ్య ఇప్పుడు లఘు మేఘాల మీద ముందుకు దూసుకు పోతున్న లారీలో వెనుక మూటల మీద చతికిలబడి కూర్చుని ఉన్నాడు.

మనిషి ముందుకు బోతున్నాడుగానీ వాడి మనసు గానీ, గుండెను పిండివేస్తున్న ఆలోచనలుగానీ ముందు కెళ్ళడం లేదు. వెనక్కే ... వెనక్కే...

"నువ్వింగేం యోచన సెయమాకయ్యా. నాను సెప్పిం దిను—సిల్లోని పానాన్ని మించి ఏముంది? నీ సత్తాకొద్దికి పోరాడ్తివి. జరక్క పాయ. ఇపుడీ బంగారానికి మొగం జూసుకుంటే బంగారట్లా పిల్లోడు మన వోట్లో దుమ్ము కొడతాడయ్యా. నే నా కడుపు మంట బరించలేను దేవుడా!"

బ్రతిమాలుకుంటూ ... కళ్ళవెంబడి నీళ్ళు కారుస్తూ ... ఇంకా ... ఇంకా ఏదో చెప్పబోతున్న ఆదేమ్మను అడ్డుకున్నాడు ముత్తయ్య.

"ఆదిగాదే .... ఆదీ! బంగారమని గాదే నే మురుస్తాండేది. అది తాలిబొట్టే.... తాలిబొట్టు. దాన్ని దీసక పొమ్మంటుండావు." బాధగా చూశాడు పెండ్లాం వైపు ముత్తయ్య.

"అయితే ఏమయ్యా! నా అదురుష్టం బాగుండాల గానీ—చెట్టంత మొగోనికి ఈ కాసింత బంగారం కాపలా కాస్తదయ్యా? అదే నీ బుగులయితే యింద—యీ పసుపుకొమ్ము కట్టు. నీ సేత్తో కట్టింది పసిడయినా, పసూకొమ్మయినా నా మెళ్ళో ఉంటే నీకు రచ్చ అని గదా ... యింద ... ముందీ బిడ్డగతి సూడు. యింగేం తాచ్చారం సెయమాక. పట్నం బోయి పచ్చిన కాడికి అమ్ముకుని రాపో. నందేలకన్నా పెద డాకటరు కాడికి తీసకపోకుంటే..." ఇంక మాటలు రాలేదు ఆదేమ్మకు. ఒక దాని వెనుక ఒకటి తన్నుకుంటూ వెక్కిళ్ళు వచ్చాయి దుఃఖం వెల్లువ కాగా.

కండ్ల నీళ్ళతో పసుపు కొమ్ము కట్టించుకుని ... కాసింత తాలిబొట్టుని అది అక్కర లక్ష్య లన్నట్టు రెండుచేతులతో బట్టుకుని ... తన దోసిట్లోబెట్టె ...

కడుపులో రగులుతున్న ఆవేదన కన్నీళ్ళుగా మారి ముత్తయ్య గుండెనీ, కళ్ళనీ బరువెక్కిస్తున్నాయి.

ఏం సెప్పేది. ఇంటికి బోయి దాంతో ఏ మొగం బెట్టుకొని మాటాడేది? పిల్లోన్ని దక్కించుకోను ఇంగెవరి కాల్లు బట్టుకొనేది ... అందరూ అప్పుడే సేతులు ఎల్లెలక లేస్తేనే గదా తాను ఇట్లొచ్చిండు. బిడ్డ ఎట్లా బతికి బట్టగడుతుడు సామీ... భగమంతుడా యీ పొద్దు ఎవురి మొగం జూసినానురా తండిరీ!

బాధగా కణతలు నొక్కుకుంటూ, ముఖాన్ని మోకాళ్ళ సందున యిరికించుకుని కుమిలికుమిలి ఏడుస్తున్నాడు ముత్తయ్య.

● ● ● ●

"ఈ పొద్దు ఎవరి మొగం జూసినామో గానీ బలె చాన్సు తగిలిందిరా ... రెండు రోజుల కోపారి మన కిట్లాంటి చాన్సు తగిలి జరిగిపోతే చాలు. అవునుగా నోరే! ఇంతకూ వాన్దగ్గర దుడ్లున్నాయని, వాడీ వల్లోకి వచ్చి పడతాడనీ నువ్వెట్లా కను క్కొంటివిరా?"

"అదేముంది దొరా! బైరునా కొడుకని సూడగానే తెల్సిపాయె. బంకుకాడ నిల్సోని ఒగటికి పద్నార్లు ఎంచుకుంటున్నాడు లెక్క—ఆ ఎంచడం సూస్తే సుమారుగానే ఉన్నట్టుంది. ఇంగ ఆ మొగం ఆ ఆత్రం జూత్తే ఆడు కట్టంలో ఉన్నట్టు జల్దీ బోవల్లనే తొందరున్నట్టు తెలుస్తానే ఉండె. ఇంగేం? మీ సెవిలో వో మాట వూదేసి మీ కా మడిసిని జూపించేసి నే నాడ జేరిపోతి. మూట ఆడిసేతిలో యిరికించి జారుకుంటి. అయినా నాదేముంది దొరా! మల్ల కతంత చినిమా నడిపిచ్చినట్టు నడిపిచ్చింది నువేగదా. నువ్వేమన్నా అను ... ఆ ఎర్రటోపీ ... ఆ కాకి గుడ్డలు, సేతిలో కట్టె చూసేతలకి ఎవుడయినా దవునయి పోవాల్సిందే ... యిహ ...హి."




సంతోషం, హుషారు పట్టలేక పోతున్నాడు ముత్తయ్యకు రాములుగా పరిచయమైన చుక్కయ్య.

"సరెసరెలె. ఇంద. ఈ మూట దీసకపోయి భద్రంగా మా ఇంట్లో ఆడోళ్ళ చేతి కిచ్చెయ్. మళ్ళీ చాన్సు దగిలినపుడు దానితో పని. ఇంద ... యీ యాభై నీకు చుక్కకు. ఈ యాభై నా చుక్కకు."

రెండు చేతుల్లో రెండు యాభయిలు పట్టుకున్నాడు హెడ్డు.

"మరి ... మరి ... ఇంగో యాభై ఉంది గద్దొరా!" చేతులు నలుపుకుంటూ నసిగాడు చుక్కయ్య

"హార్నీ ... అది నీ వడక్కొడదొరే ... ఆ యాభై నా చుక్కమ్మకు. మూన్నాళ్ళయింది నా ప్రాణం కొట్టుక పోతా వుంది. మరి నే బొయ్యొస్తా. మూట ఇంటికి జేర్చుంపోయ్ ... భద్రం."

ఫెళఫెళలాడుతున్న జేబుల్లో రెండు చేతులూ దూర్చుకుని, రెపరెప కొట్టుకొంటున్న గుండెతో చుక్కమ్మ చూపించబోయే స్వర్గాన్ని అందుకోడానికి సంతోషంతో హుషారుగా ఈల వేసుకుంటూ బయులు దేరాడు హెడ్డు చొక్కారావు చుక్కమ్మఇంటికి. ★